## 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఏహెచ్‌పీఎస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన కౌశిక్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్‌సీ బోర్డు నిర్వహించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. బోడుప్పల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విజయానికి విద్యార్థుల ఆత్మవిశ్వాసం, నిరంతర కృషి, పట్టుదలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రేరణ కూడా ముఖ్యమన్నారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ప్రణాళికబద్ధంగా చదివిస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల టెక్నికల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నళిని జయ, వైస్ ప్రిన్సిపాల్ నీలిమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు డయాగ్నస్టిక్ కేంద్రాలు సీజ్



ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్‌లోని పలు డయాగ్నస్టిక్ సెంటర్లపై అధికారులు దాడులు చేసి నిబంధనలను పాటించని రెండు డయాగ్నస్టిక్ కేంద్రాలను సీజ్ చేశారు. ఉప్పల్ రింగ్ రోడ్డు సమీపంలో గురుకృపా కాంప్లెక్స్‌లో ఉన్న వాసవీ డయాగ్నస్టిక్ సెంటర్, శోభసాయి డయాగ్నస్టిక్ సెంటర్లను మంగళవారం జిల్లా వైద్యాధికారి డా.టి.రఘునాథస్వామి ఆధ్వర్యంలో డా.సౌందర్యలత తనిఖీలు చేశారు. డయాగ్నస్టిక్ కేంద్రంలో గర్భనిర్ధారణ ప్రక్రియలకు సంబంధించిన సూచనల పట్టీ లేకపోవడం, సరైన తీరులో పూర్తి చేయని దరఖాస్తులు, స్కాన్ చేస్తున్న వైద్యుల సంతకం లేకపోవడం ఇలా నిబంధనలు పాటించకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు కేంద్రాలను సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్

కీసర: విద్యార్థులు చిన్నతనం నుండే చదువుపట్ల ఆసక్తి పెంచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అహ్మద్‌గూడ పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్కూల్‌లో 2023–24 విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్షాఫలితాల్లో (గ్రేడ్–10) ఫలితాలు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2023–24 విద్యాసంవత్సరం పది ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎం.పునీత్ 97.2 శాతంతో స్కూల్‌టాపర్‌గా నిలవగా.. ఎం. యుగల 95.6 రెండో స్థానం, సాయిసుభాష్ 91.4 మూడో స్థానంలో నిలిచాడు. భవిష్యత్తులో తమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చదువుల్లో ఉత్తమఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలతచన్నాప్రగడ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ఈటల విజయం ఖాయం'



ఘట్‌కేసర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రావు, శ్రీశైలం ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎమ్మెల్యే ఈటలపై ఉన్న నమ్మకంతో ప్రజలు బీజేపీకి ఓటేశారన్నారు. ఎన్నికల్లో గత బీఆర్ఎస్ ప్రస్తుతం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ఘోరంగా విఫలమైందన్నారు. నెల రోజుల పాటు బీజేపీ విజయానికి కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



అల్వాల్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అంబికాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ రిసాలబజార్‌లో కెనరా బ్యాంక్ సమీపంలో మంగళవారం సాయంత్రం సుమారు 55 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాల తెలిసిన వారు అల్వాల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

బన్సీలాల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతూ..జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు కథనం ప్రకారం..బన్సీలాల్‌పేట్ బండమైసమ్మ ప్రాంతానికి చెందిన అబ్దుల్ షోహెబ్(20)కు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి రెండు కిడ్నీలు పాడైపోయాయి. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పని నుంచి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు హుటాహుటిన షోహెబ్‌ను కిందికి దించి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

# ఎవరి ధీమా వారిదే..

**మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలో ఆధిక్యత మాదంటే మాదే..**

- మైనార్టీ ఓట్లు, మోదీ హవాతో మెజార్టీ తగ్గుతుందన్న బీఆర్ఎస్
- మహిళా అభ్యర్థి, పథకాలే మెజార్టీ పెంచుతాయంటున్న కాంగ్రెస్
- గత ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీపై బీజేపీ నమ్మకం



మల్కాజిగిరి/అల్వాల్: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల పోరు ముగిసింది. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో నాయకులు పర్సెంటేజీ లెక్కల్లో బిజీగా ఉన్నారు. మాకంటే మాకే అంటూ ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలోని మల్కాజిగిరి సర్కిల్‌లో ఆరు డివిజన్లు, అల్వాల్ సర్కిల్ పరిధిలో 3 డివిజన్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి సుమారు 55 వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది డివిజన్లలో నలుగురు బీఆర్ఎస్, ముగ్గురు బీజేపీ, మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ(గతంలో బీఆర్ఎస్ పార్టీ) కార్పొరేటర్లు ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నుంచి అన్ని రాజకీయ పార్టీలు ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నాలు చేశాయి.

**అన్నీ తానై బీఆర్ఎస్‌కు..**

బీఆర్ఎస్ పార్టీకి నియోజకవర్గంలో ఆ పార్టీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఉండటం బలం చేకూర్చింది. ఇటీవలే ఎన్నికలు జరగడంతో పార్టీ నాయకులతో ఉన్న సాన్నిహిత్యం, గతంలో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయడంతో ఆ అనుభవాన్ని ఉపయోగించి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. ఆ పార్టీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు, ఉద్యమకారులు ప్రచారంలో వారివంతు తోడ్పాటు అందించారు. మోదీ హవాతో పాటు మైనార్టీ వర్గం ఓట్లు కాంగ్రెస్ పార్టీకి బదలాయింపు జరిగితే ఎమ్మెల్యే ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక్కడు..**

గత ఎన్నికల్లో అనూహ్యంగా మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. ఎన్నికల కన్నా ముందు పార్టీలో చేరినా అనతికాలంలోనే ఆ పార్టీ సీనియర్ నాయకులతో పాటు తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో విజయం సాధించారు. ఆ అనుభవం పార్లమెంట్ ఎన్నికల్లో ఉపయోగపడింది. పార్టీ కూడా పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ప్రకటించడంతో ఒకే ఒక్కడుగా నియోజకవర్గంలో తనదైన శైలిలో ఎన్నికల రాజకీయాన్ని మైనంపల్లి నడిపించాడు. ఆనంద్‌బాగ్‌లోని తన కార్యాలయంలోనే ఎన్నికల వార్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు పలుమార్లు సమావేశాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పార్టీ అధికారంలో ఉండటం, మహిళలకు పథకాలు అందడంతో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపే మొగ్గుచూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మహిళా అభ్యర్థిగా పట్నం సునీతామహేందర్‌రెడ్డిని ప్రకటించడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన పార్లమెంట్ నియోజకవర్గం కావడంతో ముఖ్యమంత్రి కూడా ప్రత్యేక శ్రద్ధ వహించడం, ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ఆ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చింది.

**పార్టీ నాయకులు, కార్యకర్తలే అండగా బీజేపీ..**

మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలో బీజేపీకి బలమైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ముగ్గురు కార్పొరేటర్లు గెలుపొందారు. ఆ పార్టీ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌ను ప్రకటించడం, మిగిలిన రెండు పార్టీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడం ఆయనకు కలిసొచ్చింది. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ప్రచారంపై దృష్టి సారించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేకంటే ముందు మోదీ మల్కాజిగిరిలో పర్యటించడం ఈటల రాజేందర్‌కు కలిసొచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు కాకపోవడం, మోదీ క్రేజ్‌తో పాటు మల్కాజిగిరి ప్రాంతంలో ఉత్తరాదివారు ఎక్కువ మంది నివసిస్తుండటం, అయోధ్య రామమందిర నిర్మాణం అంశాలు ఈటల గెలుపునకు తోడ్పడతాయని, తప్పకుండా మల్కాజిగిరిలో గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీ సాధిస్తామని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ మారినప్పటికీ ఈ నియోజకవర్గంతో ఈటల రాజేందర్‌కు ఉన్న సంబంధాలు కూడా ఆయనకు కలిసొచ్చాయి.

## ఓటింగ్ శాతం డౌన్..

- పార్లమెంట్ ఎన్నికల్లో తగ్గిన ఓటింగ్ శాతం
- ఉప్పల్‌లో పోలింగ్ 48.45 శాతం
- అసెంబ్లీ ఎన్నికల్లో 51.54 శాతం పోలింగ్

ఉప్పల్: గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం చాలా వరకు తగ్గిందనే చెప్పాలి. ఏపీ, తెలంగాణలో ఎన్నికలు ఒకే రోజు కావడంతో ఇక్కడి వారు అక్కడికి వెళ్లడం, దీంతో పాటు తెలంగాణలోని ఓటర్లు తమ సొంత గ్రామాలకు ఓటు వేసేందుకు వెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొందని నిపుణులు చెబుతున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లో భాగమైన ఉప్పల్ నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 48.45 శాతం మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గంలో 5,40,052 ఓటర్లు ఉన్నారు. అందులో కేవలం 2,61655 మంది మాత్రమే తమ ఓటును వినియోగించుకున్నారు. ఇంకా ఓటును వినియోగించుకోలేని వారు 2,78,397 మంది ఉన్నారు. ఇతరులు 41 మంది ఓటర్లు ఉండగా కేవలం 11 మంది ఓటును వినియోగించుకున్నారు. ఓటేసిన వారిలో 1,35,338 మంది ఓటర్లు పురుషులు తమ ఓటును వినియోగించుకోగా 1,26,285 మంది మహిళలు ఓటును వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 51.54 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## దయానంద్‌నగర్‌లో మదర్స్ డే వేడుకలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ దయానంద్‌నగర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం శ్రీగౌతమి మహిళా మండలి ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీ కుట్టి, శాంతాకుమారి, నళిని, పవనకుమారి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రాంగ్‌రూమ్‌లోకి ఈవీఎంలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల నుంచి తరలించిన ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా మంగళవారం భోగారంలోని హోలీ మేరీ కాలేజీ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, సికింద్రాబాద్ వెస్లీ కాలేజీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంక శుక్లా, రిటర్నింగ్ అధికారి గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పార్టీల ఏజెంట్‌ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు సీల్‌వేసి భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌లకు సీఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బందితో 24 గంటలు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని రిటర్నింగ్ అధికారి గౌతమ్ తెలిపారు.

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ భోగారంలోని హోలీ మేరీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచగా.. ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు సికింద్రాబాద్ వెస్లీ కళాశాలలో భద్రపరిచినట్లు రిటర్నింగ్ అధికారి గౌతమ్ వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల పటిష్ట భద్రతను ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల ఏఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవిజయ వినాయక ఆలయ బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ న్యూమిర్జాలగూడలోని శ్రీవిజయ వినాయక ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం గురుప్రార్థన, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ కోసమే హత్య

- వ్యక్తిని పరిచయం చేసుకొని.. కలిసి మద్యం తాగి..
- మత్తులోకి జారుకోగానే తలపై సిమెంట్ ఇటుకతో దాడి..
- సెల్‌ఫోన్ తీసుకొని అక్కడి నుంచి జారుకున్న నిందితుడు
- నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు



హంతకుడు శ్రీనివాస్‌రెడ్డి

కుషాయిగూడ: ఫిబ్రవరిలో చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న అనుమానాస్పద మృతి సంఘటనను పోలీసులు హత్యగా తేల్చారు. నిందితుడిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి మాసంలో చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటన స్థలం వద్ద లభించిన ఆధారాలతో విచారణ చేపట్టి ఆంధ్రప్రదేశ్, బాపట్ల, కప్పలవారిపాలెంకు చెందిన పుట్ట శ్రీనివాస్‌రెడ్డి అనే తాపీ మేస్త్రీని అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మద్యానికి బానిసైన శ్రీనివాస్‌రెడ్డి రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు రద్దీ ప్రాంతాల్లో తిరుగుతూ సెల్‌ఫోన్లు, నగదు దొంగతనాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28న చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఒడిశాకు చెందిన బాలనస్‌బాగ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకొని మాటల్లో పెట్టాడు. తనకు మద్యం కావాలని, అవసరమైతే తన సెల్‌ఫోన్ తాకట్టు పెడతానని బాలనస్‌బాగ్ అన్నారు. దీంతో చౌకగా సెల్‌ఫోన్ వస్తుందన్న ఆశతో సమీపంలోని బార్‌కు తీసుకెళ్లిన శ్రీనివాస్‌రెడ్డి అతడికి మద్యం తాగించాడు. బయటకు వచ్చిన తర్వాత సెల్‌ఫోన్ ఇవ్వమని శ్రీనివాస్‌రెడ్డి అడగడంతో బాలానస్‌బాగ్ నిరాకరించాడు. అలా మాట్లాడుకుంటూ పక్కనే ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం వద్దకు వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న బాలానస్‌బాగ్ అలా మాట్లాడుతూనే నిద్రలోకి జారుకున్నాడు. ఇదే అదనుగా పక్కనున్న పెద్ద సిమెంట్ ఇటుక తీసుకొని బాలానస్‌బాగ్ తలపై మోది హత్య చేసి అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

## రామానుజ ప్రణవ్‌కు కరాటేలో కాంస్యం



బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన మునిపాల పురుషోత్తం కుమారుడు రామానుజ ప్రణవ్ కరాటే పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్యం మెడల్ సాధించారు. రామానుజ ప్రణవ్ బోడుప్పల్‌లోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసుకున్నాడు. డెహరాడూన్‌లో జరిగిన నేషనల్ లెవెల్ ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ 2024 జూనియర్ అండర్–21 పోటీల్లో గెలుపొందినట్లు కోచ్ కీర్తన్ కొండ్రు వెల్లడించారు. పోటీల్లో గెలుపొందడంతో అంతర్జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

## ఆహూతులను ఆకట్టుకుంటున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్



చిన్నారులను ఆకట్టుకుంటున్న ఆట వస్తువులు



బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సీ ఎగ్జిబిషన్ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా నిత్యం తిలకిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. నిత్యం బిజీగా ఉండే నగర శివారు ప్రజలు ఆటవిడుపుగా ఈ ఎగ్జిబిషన్‌కు వచ్చి ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని పొందుతున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఎంతో ఆకట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు, యువతులతో నిత్యం జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, స్టాయిల్స్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్స్ స్టాల్స్‌ను సందర్శించి అవసరం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రత్యేక ఆకర్షణీయంగా తాజ్‌మహల్, ఎర్రకోట నిలుస్తున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సీబీఎస్ఈ ఫలితాల్లో డీపీఎస్ విద్యార్థుల ప్రతిభ



టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో పాఠశాల చైర్మన్ మల్కా కొమరయ్య

మల్లాపూర్: సీబీఎస్ఈ 2023–24 ఫలితాల్లో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. పదవ తరగతి, పన్నెండవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీతారావు తెలిపారు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో పాఠశాల ప్రిన్సిపాల్ సునీతారావు మంగళవారం విలేకరుల సమావేశంలో ఫలితాలను వెల్లడించారు. పదో తరగతి ఫలితాల్లో అభినవ్ చిట్టూరి 98.7 శాతం, యుగాంక్ మంత్రి 98.5 శాతం, అల్లమనేని 98.3 శాతం, నిపున్ 98.3 శాతం పాఠశాల టాపర్లుగా నిలిచారు. పన్నెండవ తరగతిలో సైన్స్ టాపర్‌గా హనా ఫర్యాల్ 98.2 శాతం, హ్యూమనిటీస్ టాపర్ 97.4 మహేశ్వరి, కామర్స్‌లో టాపర్ గౌరవ్ సురానా 97.2 శాతం టాపర్లుగా నిలిచారు. డీపీఎస్ విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య మాట్లాడుతూ 10వ తరగతిలో 508, 12వ తరగతిలో 712 మంది ఉత్తమ ఫలితాలు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పల్లవి, సీఓఓ మల్కా యశస్వి, వైస్ ప్రిన్సిపాల్ అంకిత బోస్, అకాడమిక్ కో ఆర్డినేటర్ రాధా తదితరులు పాల్గొన్నారు.

## ఎవరి లెక్కలు వారివే..

- అందరి చూపు మల్కాజిగిరివైపు..
- పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్న పార్టీలు
- ఓట్లపై లెక్కలేసుకుంటున్న అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతి పెద్ద నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఎవరు గెలుస్తారన్న విషయంపైనే ప్రజల్లో వాడీవేడి చర్చ సాగుతోంది. దీనికి ప్రధాన కారణం తెలంగాణ సీఎం అనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ సిట్టింగ్ సీటు కావడమేనని తెలుస్తోంది. అయితే ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సీఎం రేవంత్‌రెడ్డి ఏరికోరి పార్లమెంట్ ఎన్నికల ముందే పార్టీలో చేరిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జెడ్పీ చైర్మన్ పట్నం సునీతారెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిపారు. అలాగే, బీజేపీ నుంచి మాజీ మంత్రి, సీనియర్ నేత ఈటల రాజేందర్ అధిష్టానం పోటీలో పెట్టింది. బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎన్నికలు ముగియడంతో గెలుపుపై మూడు ప్రధాన పార్టీలు ధీమాను వ్యక్తం చేయడంతో.. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా లెక్కలేసుకుంటున్నారు.

**గెలుపుపై ఆశాభావం...**

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో గట్టి పోటీ ఇచ్చినట్లుగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భావిస్తుండటంతో పాటు గెలుస్తామన్న ధీమాతో కేడర్‌కు భరోసా ఇస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి కూడా అనుచరులతో సహా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో పోలింగ్ సరళిపై లెక్కలేసుకుంటూ.. గెలుపుపై ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం రేవంత్‌రెడ్డితో సహా పార్టీ ముఖ్యనేతలు కూడా మల్కాజిగిరి ఓటింగ్ సరళి తదితర విషయాలపై ఆరా తీయడంతో పాటు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో..**

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూడా గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడమే తమ గెలుపు అంటున్నారు.

## తగ్గిన ఓటింగ్ శాతం

**ఓటేసిన 3,85,129 మంది ఓటర్లు**

మేడ్చల్ : పార్లమెంట్ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గంలో ఓటింగ్ 57.8 శాతం నమోదుకాగా.. అసెంబ్లీ ఎన్నికల్లో 62.24గా నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో 4.44 శాతం మేర ఓటింగ్ తగ్గింది.

◆ నియోజకవర్గంలో 6,65,979 మంది ఓటర్లు ఉండగా.. 3,85,129 ఓటర్లు సోమవారం జరిగిన ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లలో 3,40,218 మంది పురుషులు, 3,25,703 మంది స్త్రీలు, 58 మంది ఇతరులు ఉన్నారు.

◆ ఓటర్లలో 1,98,966 మంది పురుషులు, 1,86,148 మంది స్త్రీలు 15 మంది ఇతర ఓట్లరు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

**మేడ్చల్ నియోజకవర్గం వారీగా పోలైన ఓటింగ్ వివరాలు..**

| మండలం/మున్సిపాలిటీ | మొత్తంఓటర్లు | పోలైనవి | శాతం |
|---|---|---|---|
| కీసర | 28,759 | 21,179 | 73.64 |
| శామీర్‌పేట్ | 33,215 | 22,767 | 68.54 |
| మూడుచింతపల్లి | 20265 | 16491 | 81.38 |
| తూంకుంట | 20265 | 16491 | 81.38 |
| మేడ్చల్(మున్సిపాలిటీ) | 45,138 | 25,284 | 56.01 |
| దమ్మాయిగూడ | 46726 | 24774 | 53.02 |
| నాగారం | 53609 | 28109 | 53.03 |
| జవహర్‌నగర్ | 87112 | 41507 | 47.65 |
| ఘట్‌కేసర్(మండలం) | 41952 | 27181 | 64.79 |
| ఘట్‌కేసర్(మున్సిపాలిటీ) | 29845 | 17348 | 58.12 |
| పోచారం | 29797 | 16648 | 55.00 |
| బోడుప్పల్/పీర్జాదిగూడ | 165300 | 66182 | 51.27 |
| గుండ్లపోచంపల్లి | 20521 | 10603 | 51.0 |